ఉద్యోగం దొరికే వరకు పాకులాట...దొరికిన తర్వాత..!

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానంలో పొరుగు సేవలు చేస్తున్న సిబ్బందికి శాశ్వత ఉద్యోగులంటే లెక్కలేదు అంటూ అధికారులు, సిబ్బంది అంటున్నారు. ఎందుకంటే మేము (శాశ్వత) పరీక్షలు లేదా కారుణ్య నియామకాలపై ఈ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నాం. కాని వారు త్రుణమో, పణమో లేదంటే సిఫార్స్ లేఖలపై విధుల్లో చేరి మేకులా తయారయ్యారని గుస గుసలు వినిపిస్తున్నాయి. పొరుగు సేవల సిబ్బందికి వేరే షిఫ్ట్‌కి రమ్మన్నా, ఒక విభాగం నుండి మరొక విభాగంకు మార్పు చేసినా, సదరు (పొరుగు సేవలు) సిబ్బంది ఇలాగైతే నాకు అవ్వదండి, అవసరమైతే ఈఓతో మాట్లాడుతాం గాని మీరు రమ్మన్న షిఫ్ట్‌కు రావటం కుదరదు అంటూ ఘాటు సమాధానాలే చెబుతున్నారు. కొంతమంది పనిలేనప్పుడు, పని దొరకడం లేదని బాధపడతారు. తీరా దొరికిన తర్వాత సోమరులా తయారౌతున్నారు. తద్వారా తమ పీఠానికే ఎసరు తెచ్చుకుంటారు. మంచి పదవి దక్కే దాకా దానికోసమే పోరాడుతారు. ఆ పదవి దక్కిన తర్వాత ప్రతి నిమిషం టెన్షన్ అంటారు. ఇంకా పెద్ద పదవి వస్తే ఏం చేస్తారు...? "ఇంతకు ముందు ఎంతో ఆనందంగా ఉండేవాణ్ణి.. ఇప్పుడు ప్రశాంతత కోల్పోయింద"ని బాధను వ్యక్తం చేస్తుంటారు. నిజానికి పని లేనప్పుడు వారనుభవించిన నరకయాతన అస్సలు గుర్తు రాకపోవడం మూలానే ఈ మాటలు వస్తాయి.

ఫీజులు చెల్లిస్తేనే దసరా సెలవులకు ఇంటికి...

ఇదీ రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యం మొండి వైఖరి

విశాలాంధ్ర - ఆనందపురం: ఫీజులు చెల్లిస్తేనే విద్యార్థులను దసరా సెలవులకు ఇంటికి పంపిస్తామని రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడంతో పాఠశాల వద్ద పిల్లలు తల్లిదండ్రుల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆనందపురం మండలం వెల్లంకి సమీపంలో రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాలలో ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను దసరా సెలవులకు ఇంటికి పంపకపోవడంతో తల్లిదండ్రులు విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. సగం ఫీజులు చెల్లించామని మిగిలిన సగం డిసెంబరు లోపు చెల్లిస్తామని చెప్పినా వినకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో జాయినింగ్ సమయంలో 60 వేల రూపాయలు అన్నారని, కానీ ఇప్పుడు 90 వేల రూపాయల ఫీజులు చెల్లించాలంటున్నారని అన్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో పాఠశాలలకు దసరా సెలవులు ఉన్నాయని స్కూల్ గ్రూపులలో మెసేజులు పెట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. అయితే ఫీజులు చెల్లిస్తేనే ఇంటికి విద్యార్థులను పంపుతామని మొండికేయడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో ఫీజులు వేధింపులు తగ్గించేటట్లు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - పరవాడ: సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 16న పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని యుజియా ఫార్మా కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు కంపెనీ పరిసర ప్రాంతాన్ని శుక్రవారం పర్యవేక్షించారు. కంపెనీ ప్రాంగణంలో హెలీప్యాడ్ ఏర్పాటు, ప్రారం భోత్సవ వేదికను జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, జిల్లా కలెక్టర్ రవిపట్టన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ పరిశీలించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, తహశీల్దారు పి.కనకారావు ఉన్నారు.

వయోజన విద్య విద్యా కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర - అనంతగిరి: స్థానిక సమిద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రోటరీ ఇండియా లిటరసీ మిషన్ కోల్‌కతా వారి సహకారంతో కొండిబ గ్రామంలో వయోజన విద్యా కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సర్పంచ్ పున్నమ్మ, రోటరీ జిల్లా గవర్నర్ డా. ఎం.వెంక టేశ్వరరావులు ప్రారంభించారు. విద్యాభివృద్ధి కొరకు సమిద సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ఎంపీపీ అభినందించారు. జెడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ విద్య వలన ప్రతీ కుటుంబం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో "సమిద " కార్యదర్శి డి.వీరభద్రరావు, సమిద అధ్యక్షులు పడాల రమణ, సంస్థ కోఆర్డినేటర్లు డి.బుద్దరాజు, జన్ని సింహాద్రి, స్వాభి అప్పలరాజు, సమర్థి కృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబుని వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని నాయకులు బృందావనం కాలనీలోని దుర్గమ్మ చెట్టు ఆలయంలో పూజలు నిర్వహించారు. కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో

పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, యాళ్ల సన్న బాబు, బత్తిన అచ్చిరాజు, లెక్కల గోవిందు, దేవు వినోద్, రాజాన ఆదినారాయణ, పల్లా విలియం కేరీ, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, వేములపూడి అప్పారావు, మలిపెద్ది వెంకటరమణ, గుల్లా నాగరాజు, ఏడిద సురేష్, చిరుకూరి పేర్రాజు, పిన్నింటి సూరిబాబు, కట్టా శ్రీను, గంపల చినరాజు, ముంజులూరి దుర్గాప్రసాద్, బోడపాటి శ్రీను, ఏమిలీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చడమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : గిరిజన మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చడమే వన్ ధన్ వికాస కేంద్రాల లక్ష్యమని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ అన్నారు. స్థానిక కాఫీ హౌస్‌లో ఐటీడీఏ, వెలుగు, ట్రైఫెడ్ సంయుక్తంగా విడివికెల ఉత్పత్తులపై శుక్రవారం ఏర్పాటు చేసిన ట్రైబల్ ఆర్టిజాన్ ఎంప్యానెల్మెంట్ మేళాకు పీఓ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఏజెన్సీలో సాగు చేస్తున్న ఆర్గానిక్ కాఫీ ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఏ పీడీ వి.మురళి, కాఫీ బోర్డు డిడి రమేష్, జిసిసి డిఎం సింహాచలం, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సి. హెచ్.దేవి, వెలుగు సిబ్బంది, విడివికెల నిర్వాహకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర - కశింకోట: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విద్య, వైద్యం రెండు కళ్ళు వంటివని అందుకు నిదర్శనమే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జే.తుని గ్రామంలో గ్రామ సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రాష్ట్రమంతా విశేష స్పందన లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నమ్మి మీనా గణేష్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, వైసిపి నాయకులు కోన సత్యన్నారాయణ, ఎంపీడీవో రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యస్.రాయవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోకులపాడు గ్రామంలోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారా యణ, మండల విద్యాశాఖ అధికారి - 1 అప్పారావు, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అద్దేపల్లి నూకి నాయుడు, వైసీపీ నాయకులు అద్దేపల్లి బొజ్జన్న, బాబురావు, నీలేంద్రరావు పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభం మండలం బాంధ్యపురం పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, కులం మతం ప్రాంతం పార్టీ చూడకుండా ఎలాంటి వివక్ష చూపకుండా పైసా లంచం లేకుండా వాలంటీర్ల ద్వారా పాలన అందిస్తూ నూతన పాలనకు శ్రీకారం చుట్టి పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం అనుసరించేలా పాలన చేసి పేదల మనసుల్లో ఉన్నారని అన్నారు. అనంతరం శిబిరంలో పలు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులను, వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల పరిధిలో గల వనుగుమ్మ, రంగబయలు పంచాయతీ పరిధిలో ఈ నెల 19వ తేదీన జరగబోయే ఆరోగ్య సురక్షపై వైద్య ఆరోగ్యశాఖ గ్రామ వాలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం రశీదు పంపిణీ చేశారు. ఏఎన్ఎం ఎం.గౌరీ మణి, మహిళా పోలీస్ సౌందర్య, గ్రామ వాలంటర్ దేవ, ఆశా కార్యకర్త సువర్ణలు గ్రామాలలో పర్యటించి అవగాహన కల్పించి రశీదులు అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వి.మాడుగుల: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడం నిరంతర ప్రక్రియ అని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు.

దేవరాపల్లి మండలం తారువ, కె.కోటపాడు మండలం సంతపాలెం గ్రామలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పరిశీలించి ఏర్పాటు చేసిన పలు శిబిరాలను సందర్శించారు. అనంతరం వైద్య సేవలు కోసం వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. తారువలోని అరోగ్య శిబిరంలో ఉప ముఖ్యమంత్రి, స్థానిక జెడ్పీటీసీ అరోగ్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు కర్రీ సత్యం, ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, మండలాధికారులు, వైద్యాధికారులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు మోపడం సరికాదు

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల అమలులో భాగంగా సామాన్యులపై విద్యుత్ ఛార్జీల భారం మోపడం దారుణమని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విమర్శించారు. విద్యుత్ ఛార్జీల మోతను నిరసిస్తూ సీపీఐ, ముఠా కార్మిక సం ఘం (ఏఐటీయూసీ) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పూర్ణామార్కెట్, స్ప్రింగ్ రోడ్డు, పందంపుల్ల సందు తదితర ప్రాంతాలలో వాణిజ్య దుకాణాలకు, ప్రజలకు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల సర్ ఛార్జీల పేరుతో సామాన్య ప్రజానీకంపై విద్యుత్ ఛార్జీల మోతకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, గత ఎన్నికల ప్రచారంలో విద్యుత్ ఛార్జీలను పెంచబోమని అధికారం చేపట్టి నేడు ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మధరావు, సిఎన్ క్షేత్రపాల్, ముఠా కార్మికులు బి.సాంబయ్య, జి.సూరి బాబు, ఎ.పైడిరాజు, డి.కృష్ణ, ఎస్.వెంకటరావు, శ్రీనివాస రావు, అప్పలనాయుడు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి పెంచుతున్న విద్యుత్తు ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడాల గోవిందు, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇసుకతోట జంక్షన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. విద్యుత్తు సంస్థలకు వస్తున్న నష్టాలను భర్తీ చేయడానికి విద్యుత్తు వినియో గదారులను బలి చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ఇంధన ఛార్జీల సర్దుబాటు, సర్వీస్ ఛార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తుందని మండిపడ్డారు. ఈ ధర్నాలో సిపిఐ నాయకులు రావి కృష్ణ, ఆర్.అశోక్, ఏఐటీయూసీ నాయకులు ఎం.ర మణ, గద్దం రాము, ఎం.అప్పల రెడ్డి, దుర్గా రావు, నీలయ్య అప్పల రెడ్డి, పి.సూరి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దుచేసి, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలని సీపీఐ, సీపీఎం పార్టీలు అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్రం పెట్టిన షరతులకు తలొగ్గి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచడమే కాకుండా రైతుల వ్యవసాయ పంపుసెట్లు స్మార్ట్ మీటర్లు బిగించడానికి తెగుపడ్డారని దీనివల్ల రాష్ట్రంలో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు బతుకు దుర్భరంగా మారి సతమతమవుతుంటే, మూలిగే నక్క పైన తాటి పండు పడ్డ చందంగా విద్యుత్ చార్జీలు పెంచి వారిపై భారం మోపడం తగదన్నారు. ప్రభుత్వం నిర్ణయం ఉపసంహరించుకోకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, వై.ఎస్.భద్రం, సీపీఐ మండల కార్యదర్శి చెల్లూరు నాగరాజు, కోరుబిల్లి శంకర్రావు, తాకసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోన లక్ష్మన్న, సిపిఎం నాయకులు నాయన బాబు, ఏ బాలకృష్ణ, గంట శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా వామపక్షాల జాతీయ సమితి పిలుపుమేరకు విద్యుత్తు చార్జీలు, స్మార్ట్ మీటర్లపై ధర్నా నిర్వహించారు. సీపీఐ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ అధిక భారాలను తగ్గిస్తామని మాయమాటలు చెప్పి గద్దికెక్కిన ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ దేశ రాష్ట్ర ప్రజలపైన జాలి, దయ ఉంటే పెరుగుతున్న విద్యుత్తు చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం వామపక్ష నాయకులు జి.గురుబాబు, సావిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.వి. రమణ, ఈరెల్లి చిరంజీవి, జి.రాధాకృష్ణ, శివలంక కొం డలరావు, మేకా భాస్కరరావు, నల్లబెల్లి శ్రీరామ మూర్తి, భూషణం, శ్రీరంగ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: ఎన్నికల ముందు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత 5 సార్లు చార్జీలు పెంచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పరాభవం తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ చేపట్టిన

పోరాట యాత్ర జివిఎంసి 95వ వార్డు వేపగుంట సమీపంలోని వరలక్ష్మీనగర్‌లో శుక్రవారం సాగింది. సీపీఐ పెందుర్తి శాఖ కార్యదర్శి అసిరి నాయుడు, పార్టీ నాయకులు, శ్రీనివాసరావు, రామారావు, మల్లేష్ తదితరులతో కలిసి వరలక్ష్మీనగర్‌లో పర్యటించిన శ్రీనివాసరావు ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించారు. నాడు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచి, వామపక్షాల పోరాటంతో ప్రతిపక్షంలో కూర్చున్నారని, ఇపుడు జగన్ అంతకుమించి చార్జీలు పెంచారని విమర్శించారు.

మల్కాపురం: పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు అని సీపీఐ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతం పరిధి 59వ వార్డులో గల శ్రీహరిపురం, నక్కవానిపాలెం, చైతన్య నగర్ ఏరియాలో నిరసన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని, పెంచిన కరెంటు చార్జీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గండి అప్పారావు, లక్ష్మి, జయ, గండి రమణమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

15న హిందూపురంలో సదస్సు జయప్రదం చేయండి

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 15న హిం దూపురం మున్సిపల్ నగర పాలక సంస్థలలో మున్సిపాలిటీ, నగర పంచాయితీలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, నాన్ పి.హెచ్ వర్కర్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో ఆఫీస్ స్టాఫ్ విభాగాలలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలని జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్లో పనిచేస్తున్న 13000 మంది ఇంజనీరింగ్ కార్మికులు, ఆఫీస్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డ్రైవర్లు, పార్క్ కూలీలకు గత పిఆర్సిలో వేతనాలు పెంపు బేసిక్ పేకు అనుగుణంగా జరగ లేదన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తానని మాట మార్చి ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేశారన్నారు.

థీమ్ పార్కులను త్వరితగతిన పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ సి.ఎం సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన పలు థీమ్ పార్కులను, ల్యాండ్ స్కేప్ గార్డెన్ పార్కులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన రెండవ జోన్‌లో 6వ వార్డు నందు షిప్ యార్డ్ లేఔట్ యోగ థీమ్ పార్క్ , బకన్నపాలెం లచ్చిరాజు లేఔట్ నందు స్పోర్ట్స్ థీమ్ పార్క్, ఎం.ఎస్.ఆర్ లేఅవుట్ ఉజ్వల్ నగర్ నందు ల్యాండ్ స్కేపింగ్ గార్డెన్ పార్క్‌లను కార్యనిర్వాహక ఇంజనీర్ శాంసన్ రాజు, రెండవ జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, డి.డి.హెచ్ దామోదర్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

యోగ థీమ్ పార్క్‌లో పెద్ద చెట్లతో ప్లాంటేషన్ చేయాలని, దసరా నాటికి ఈ పార్క్‌ని పూర్తి చేసి అందంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్య క్రమంలో ఈఈ శాంతి రాజు, ఏ.సి.పి. శర్మ, అసి స్టెంట్ ఇంజనీర్లు సురేష్, శ్రీహరి పాల్గొన్నారు.

నక్కపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: సకాలంలో వర్షాలు పడకపోవడం వలన నక్కపల్లి మండలం పూర్తిగా ఏడాది వరి పంట దెబ్బతిందని దానితోపాటు ఉద్యానవన పంటలు కూడా దెబ్బతిన్నాయని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆలోచించి కరువు మండలంగా ప్రకటించాలని మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీర్మానం చేశారు. గత సమావేశంలో సమస్యలు పరిష్కారం అయ్యాయో లేదా అనేది చెప్పాలని ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, కుంచె మధులు పట్టుబట్టారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ అంబేద్కర్ తాసిల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ సర్వేయర్లు ఎవరు లేరని ప్రభుత్వం నియమించిన సర్వేయర్లే పనిచేస్తున్నారని సిఎస్ డిటి నాలుగు మండలాలకు ఒక్కరే కావడం వలన పని ఇబ్బంది వస్తుందని అన్నారు. గుడిచర్ల పిఎసిఎస్ అధ్యక్షులు పొడగట్ల పాపారావు మాట్లాడుతూ అందరికీ క్రాప్ ఇన్సూరెన్స్ వర్తించేటట్లు కృషి చేయాలని జల జీవన్ మిషన్ రెండో విడత పనులు 41 వచ్చాయని వాటిని త్వరలో ప్రారంభిస్తామని జేఈ నాగభూషణం చెప్పారు. అలాగే పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో వేంపాడు పిఎసిఎస్ అధ్యక్షులు అయినంపూడి బంగార్రాజు, ఎండిఓ శ్రీనివాసరావు, ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, పట్టణ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు ఎలమంచిలి తాతబాబు, మండల కోఆప్షన్ సభ్యులు లొడగల చంద్రబాబు, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, మెరుగు నాగేశ్వరరావు, వీసం దేవి, సర్పంచులు రెడ్డి వరహాలు బాబు, కొలుకులూరు సురేష్ వర్మ, ఏడిద నూక రత్నం, పోతంశెట్టి రాజేష్, లతోపాటు ఎంఈఓ నరేష్, ఎస్సై శిరీష తోపాటు పలువురు శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ఓటమి భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు

విశాలాంధ్ర - అరకులోయ: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఓటమి భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని టీడీపీ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు సివేరి దొన్నుదొర ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దలబుడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు బయట ఉంటే ఎన్నికల్లో గెలవలేమని భయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పట్టుకుందన్నారు. వెంటనే ఆయనకు సూపర్ స్పెషాలిటీ ఆసు పత్రిలో చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. 73 ఏళ్ళ వయస్సు ఉన్న పెద్దమనిషిని జైలులో పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, టిడిపి రాష్ట్ర మహిళ కార్యదర్శి బూర్జా లక్ష్మి, టిడిపి బిసి నాయకురాలు సీరజ, మాజీ ఎంపీటీసీ కుమార్, టిడిపి యువజన నాయకుడు కిల్లో నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా జగతా శ్రీనివాస్

విశాలాంధ్ర - పాయకరావుపేట: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పాయకరావుపేటకు చెందిన జగతా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్ నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం జగతా శ్రీనివాస్ పిసిసి డెలిగేట్‌గా ఉన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేశారు. తనకు పదవి కల్పించినందుకు పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్ చార్జ్ పోచారెడ్డి రాకేష్ రెడ్డికి జగతా శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

యువత ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - మధురవాడ: వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే యువతరం కేవలం ప్రాంగణ నియామకాలపై మాత్రమే నమ్ముకోకుండా స్టార్టప్‌ల ఏర్పాటు, ఉన్నత విద్య, సివిల్ సర్వీసెస్‌లో ప్రవేశించడం వంటి ప్రత్యామ్నాయ అవకాశాలపై సహితం దృష్టి సారించాలని వక్తలు అన్నారు. గీతం కేరీర్ గైడెన్స్ సెంటర్ విద్యార్థులకు వివిధ అవకాశాలపై సమాచారం ఇచ్చేందుకు రూపొందించిన వివిధ పోర్టల్‌ను శుక్రవారం ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించిన "వివిధ పోర్టల్" విద్యార్థులకు మార్గదర్శకం కాగలదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం కేరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరక్టర్ బి.వికాస్, స్టూడెంట్ లైఫ్ డిప్యూటీ డైరెక్టర్ శృతి తదితరులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: చట్ట వ్యతిరేకమైన గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పదని స్థానిక ఎస్సై కె.సంతోష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల మండలంలోని కోరాయి పంచాయతీ పరిధిలోనున్న జాతరవలస గ్రామానికి చెందిన కిల్లో దామోదర్, లోకోయి విశ్వనాథ్ అనే ఇద్దరు వ్యక్తులు గ్రామ సమీపంలోని సుమారు 150 గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో చట్ట వ్యతిరేకంగా గంజాయి సాగు చేస్తున్న ఆ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

స్పందనకు 305 వినతులు

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి 305 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా మెరుగైన సేవలు అందించటానికి, వారి సమస్యలు అత్యంత దగ్గరగా పరిశీలించటానికి మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన వేదికగా ఉందని చెప్పారు. ప్రతి సమస్యను పరిశ్కరించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని, ప్రతి సమస్యపై ఒక విచారణ అధికారిని నియమించి సకాలంలో పరిష్కారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ జె.శివ శ్రీనివాసు, తహశీల్దార్ కె.అప్పల స్వామి, ఎంపీడీఓ ఆర్.లోహిత్ జయ సాగర్, ఎంపీపీ కె.పద్మ, జెడ్పీటీసీ డా. వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

16 నుండి ఈవీఎంల తనిఖీ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 16వ తేది నుండి నవంబర్ 20వ తేదీ వరకు ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం పగడ్బంది ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

తెలిపారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు జరుగుతుందని, 24 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని అన్నారు. ఆయా టేబుల్లో డిటి, పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా.ఏ మల్లికార్జున, డిఆర్‌ఓ కె.మోహన్ రావు, డిసిఓ టి.ప్రవీణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - సీలేరు: వ్యాధులు సక్రమించకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య సూచించారు. శుక్రవారం జికెవీధి మండలం సీలేరు గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినీలకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమెండెంట్ వి.సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ ఎన్.త్రినాధ్, ప్రధానోపాధ్యాయులు దేవమణి, వార్డెన్ వసుపులేటి శకుంతల పాల్గొన్నారు.

నేటి నుండి ఎస్ఐ రాత పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీలలో విశాఖ నగరంలో జరగబోతున్న సబ్ ఇన్స్పెక్టర్ (సివిల్) రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏ.పి.ఎస్.పి) అభ్యర్థుల మెయిన్స్ రాత పరీక్షల కొరకు విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రేంజ్ డి.ఐ.జి శుక్రవారం విశాఖ నగర పోలీసు కాన్ఫరెన్స్ హాలులో రాత పరీక్షల సెంటర్లు కలిగిన ఆయా పరిధి ఏసిపిలు, ఎగ్జామ్ ఇంఛార్జిలైన సి.ఐ లు, ఇతర బందోబస్తు అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో అన్ని వసతులతో, పారదర్శకముగా నిర్వహించేలా తగు ఆదేశాలు జారీ చేశారు. తేదీ 14.10.2023 , 15.10.2023 వ తేదీలలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకూ మొదటి పేపర్ , మధ్యాహ్నం 02:30 గం. నుండి సాయంత్రం 5:30 వరకు రెండోవ పేపర్ జరుగుతుందన్నారు. పురుషులు 9913 , మహిళలు 1452 మెయిన్స్ రాత పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు.

బెస్పోక్ డబల్ డోర్ రిఫ్రిజిరేటర్స్ తీసుకువచ్చిన శాంసంగ్

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆధునిక భారతీయ వినియోగదారుల అవసరాలను తీర్చడానికి రూపొందించిన తమ బెస్ పోక్ డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్ శ్రేణిని ఈ రోజు ప్రారంభించినట్లు భారతదేశంలో నంబర్ వన్ రిఫ్రిజిరేటర్ బ్రాండ్ సాంసంగ్ ప్రకటించింది. అందమైన రంగు ఎంపికల శ్రేణితో, కొత్త బెస్పోక్ రిఫ్రిజిరేటర్లు ఏదైనా కిచెన్ కైనా పట్టణ సొగసుదనం మరియు వ్యక్తిగతతను అందిస్తాయి. బెస్పోక్ ప్రీమియం కొట్టా స్టీల్ బెస్పోక్ గ్లాస్ వేరియంట్‌లలో అందుబాటులో ఉన్న సాంసంగ్ వారి సరికొత్త బెస్పోక్ డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్ శ్రేణి, వ్యక్తిగతీకరించిన అందాన్ని ఆధునిక రిఫ్రిజిరేషన్‌తో సజావుగా కలుపుతుంది, రోజువారీ జీవితాన్ని శ్రమరహితంగా మరియు స్టైలిష్‌గా చేస్తుంది.బెస్పోక్ ప్రీమియం కొట్టా వేరియెంట్ మీ కిచెన్ కు పురాతన అందం మరియు స్నేహపూర్వకమైన రూపాన్ని ఇస్తుంది. ఇది కొట్టా బీజ్ మరియు చార్ కోల్ (డ్యూయల్ టోన్) మరియు కొట్టా చార్ కోల్ అనే రెండు రంగులలో లభిస్తోంది.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ధర్నా

విశాలాంధ్ర - సీలేరు: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ కమిటీ పిలుపుమేరకు శుక్రవారం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, మహిళా కార్మికులు సీలేరు సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తమ సమస్యలు పరిష్కరించాలంటూ జెన్ ఎస్ఇకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణ్, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి అభివృద్ధికి శక్తివంచన లేకుండా చేస్తామని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. అనంతగిరి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా స్థానిక జడ్పిటిసి దీసరి గంగరాజుతో కలిసి ఆమె పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. హౌసింగ్ లో నెలకొన్న సమస్యలను చర్చించారు. ఏఈ నాగేశ్వరరావుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. డెక్కపురం రహదారి పూర్తయ్యేలా చూడాలని స్థానికులు ఈ సందర్భంగా కోరారు. సర్పంచ్ సోమెల రూతు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో ఆడారి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో 91వ వార్డు 483 సచివాలయం పరిధిలో గల రామకృష్ణ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఏపి.ఎమ్మెస్.ఎం.ఈ.డిసి అధ్యక్షులు ఆడారి ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి 400 మంది లబ్ధిదారులకు జగనన్న బ్రోచర్స్‌ను అందజేసి వివిధ సమస్యలపై వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. అర్హులైన 10 మంది లబ్ధిదారులకు రైస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 91వ అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివా సరావు, గేదెల మురళీకృష్ణ, 90వ వార్డు అధ్యక్షులు నమ్మి శ్రీను, కాళ్ల వీర్రాజు, వెంకటేష్, ఊటపల్లి గోవిందు, తెలుకుల రమేష్, దుర్గేష్, వెంకట్, దేరెడ్ల సత్య నారాయణ రెడ్డి, తమ్మి రెడ్డి, తాతారావు, కడితి రాజు, మార్కండేయ రాజశేఖర్, జీవీ రమణ, బల్లంకి ప్రేమ్ కుమార్, భారతిప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

15 నుండి దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లో వేంచేసిన శ్రీ దుర్గాదేవి ఆలయంలో ఈ నెల 15 నుండి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.శివకుమార్ శర్మ తెలియజేశారు. విశిష్ట చరిత్ర కలిగిన దుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు చోడవరం చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు, భక్తులు తరలి వస్తారని తెలిపారు. శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ సూక్త పూర్వకంగా మహిళల చే అమ్మవారికి సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర - నర్సీపట్నం: మున్సిపాలిటీలో పారిశుధ్య మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు అన్నారు. శుక్రవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచడానికి నూతన పరికరాలు పనిముట్లు సమకూర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ముఖ్యంగా శానిటేషన్ వర్కర్ల సమస్య ఉందని దానిని అధిగమించడానికి సిబ్బంది ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఎప్పటికప్పుడు తాను కూడా వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకునేందుకు కృషి చేస్తానన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ పనులు కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆమోదయోగ్యంగానే జరుగుతున్నాయన్నారు.

నష్టపరిహారం చెల్లించాకే నిర్మాణ పనులు చేపట్టండి

విశాలాంధ్ర - కొయ్యూరు : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు పూర్తి నష్టపరిహారం చెల్లించాకే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని బాధిత రైతాంగం కోరుతున్నారు. మండలంలోని నడింపాలెం పంచాయతీ పరిధి 18 మంది గిరి రైతాంగం జాతీయ రహదారి నిర్మాణంలో తమ భూములను కోల్పోతున్నారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారి వివరాలు సేకరించి సర్వే నిర్వహించిన అధికారులు పట్టా భూమిలో తొలగిస్తున్న చెట్లకు మాత్రమే నష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో ఖంగుతున్న ఆయా రైతాంగం తమ భూములకు కూడా నష్టపరిహారం అందించాలని తాసిల్దార్ వద్ద నుండి సబ్ కలెక్టర్ వరకు అందరి అధికారులకు విన్నవించుకున్నారు. తమ సమస్యను అధికారుల దృష్టికి పలు పర్యాయాలు తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించిన ఫలితం లేక పోయిందని ఆయా రైతాంగం వాపోతున్నారు. తాము కోల్పోతున్న భూ ములకు నష్టపరిహారం చెల్లించకుండానే రహదారి నిర్మాణ పనులు చేపట్టి రాత్రి సమయంలో శరవేగంగా చేస్తున్నారని రైతాంగం ఆరోపిస్తున్నారు.

పలు కోర్సుల్లో యువతకు శిక్షణ



విశాలాంధ్ర - జికేవీధి: స్కిల్ డెవలప్‌మెంట్ కింద వివిధ రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు గాను యువత నుంచి దరఖాస్తులు కోరడం జరుగుతుందని జికేవీధి ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ దరఖాస్తులు స్వీకరించుటకు ఈ నెల 30 తేదీ వరకు అవకాశం ఉందన్నారు. కావున ఇంకా అర్హులైన అభ్యర్థులు ఉంటే ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జోరుగా ఎంవీఆర్ ఉచిత తీర్థయాత్ర బస్సులు

విశాలాంధ్ర - మునగపాక: ప్రముఖ వ్యాపారవేత్త సేవాపరుడు ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్థ యాత్రలు జోరుగా కొన సాగుతున్నాయి. దీనిలో భాగంగా మునగపాక మండలంలో ఉన్నటువంటి భక్తులతో ప్రముఖ పుణ్యక్షేత్రాలు అయిన సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ దర్శనములకు బస్సులు బయలు దేరాయి. ఈ కార్యక్రమానికి ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ (సంజూ బాబు) హాజరై గ్రామ ప్రజలతో మమేకమై, అందర్నీ పలకరిస్తూ ఒక్కొక్కరిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న శివాలయాన్ని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజు టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ సర్కారుకు మిగిలింది 100 రోజులే

ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జగన్ ప్రభుత్వానికి వందరోజులే మిగిలి ఉందని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో బస్ షెల్టర్ సరిగ్గా కట్ట లేక పోయారని, విశాఖను రాజధాని ఎలా చేయగలరని ఎద్దేవా చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ టిడిపికి ఇవి చివరి రోజులు అంటున్నారని, ఎవరికి చివరి రోజులో ఎన్నికలే తేలుస్తాయి అని అన్నారు. ఇక కేవలం వంద రోజులే ఈ జగన్ ప్రభుత్వానికి ఉన్న టైం అన్నారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితం కోసం జగన్ మాట్లాడడం సరికాదని, 212 పోస్టులు రెడ్లకి ఇచ్చి బిసిలను మోసం చేసి మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు ఐదు కేజీలు బరువు తగ్గారని, పార్టీ శ్రేణులు కూడా ఆందోళన చెందుతున్నాయన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై వైసిపి నేతలు ఇష్టరాజ్యంగా మాట్లాడుతున్నారని, జాతీయస్థాయిలో పేరున్న వ్యక్తిని ఆరోగ్య పరంగా ఇబ్బంది పడుతుంటే వేళాకోళం చేయడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ చిక్కాల విజయబాబు, వాడ్రాసి అప్పలరాజు, ఎర్నాగుల జగదీష్, భోగి రమణ పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలు వాస్తవమే

వీఆర్వో కొండబాబు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని దిగుడు పుట్టు గడ్డలో అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు సిండికేట్‌గా తయారై అక్రమంగా ఇసుకను తరలించి లాభార్జన చేసుకుంటున్నారని స్థానిక వీఆర్వో కొండబాబు చెప్పారు. మండలంలో అనధికారికంగా జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ఈనెల 11న విశాలాంధ్రలో అర్ధ రాత్రి ఇసుక తవ్వకాలు అనే శీర్షిక ప్రచురితమైంది. దీనికి స్పందించిన స్థానిక వీఆర్వో కొండబాబు శుక్రవారం దిగుడు పుట్టు గెడ్డ వద్ద సందర్శించి ఇసుక తవ్వకాలను పరిశీలించారు. ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించి అక్రమ ఇసుక రవాణాదారులకు ఇకనుంచి తవ్వకూడదని హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో కూడా దిన పత్రికల్లో ప్రచురితమైన కథనాన్ని చూసి స్థానిక తహశీల్దార్ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక తవ్వకాలు చేయకూడదని హెచ్చరించడం జరిగిందన్నారు. అయినా సరే ఇసుక రవాణాదారులు అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా రవాణా చేసుకుంటున్నారని ఇటీవల కథనం విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిందని ఇది వాస్తవమేమనని చెప్పారు. వారం రోజుల క్రితం దిగు డుపుట్టు గ్రామంలో ప్రాథమిక పాఠ శాల వెనకాల, గ్రామానికి వెళ్లే రహదారి ఎడమ పక్కన తవ్వకాలు చేసిన ఇసుకను నిల్వచేసి విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకొని తహశీల్దార్ ఆదేశాలు మేరకు అక్కడికి రెవెన్యూ సిబ్బందితో వెళ్లి తవ్వకాలు చేస్తున్న పనిముట్లను తహసి ల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేయడం జరిగిందన్నారు. ఇప్పటి కైనా అక్రమ ఇసుక రవణదారులు తవ్వకాలను నిలుపుదల చేయాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కు, సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ అన్నారు. స్థానిక పాత పాడేరు గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్లు, మందుల పంపిణీ, స్క్రీనింగ్ పరీక్షలు, రక్త పరీక్షలు, విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పిడి వి.మురళి, డా. గోపాల క్రిష్ణ, డా. ఎం.శివ రామకృష్ణ, డా. జాఫర్ హుస్సేన్, డా. కాటంరాజు, వైద్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలంతా సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండలంలో గల ఎన్‌ఆర్ పురం సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కార్య

క్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వీటిని సక్రమంగా వినియోగించుకొని ఆరోగ్య సమస్యల నుంచి బయట పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్రావు, కార్యదర్శి వరలక్ష్మి, సర్పంచ్ సన్యాసమ్మ, కాశీపట్నం వీఆర్వో మానవతి, కో ఆప్షన్ సభ్యులు మదీనా పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలో కుసులువాడ గ్రామపంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై

ముందుగా పలువురు డాక్టర్లు ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సురక్ష ప్రత్యేక అధికారి పద్మ, ఎంపీడీవో అడపా లవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, స్థానిక సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీ, డాక్టర్లు గంగునాయుడు, సాంబమూర్తి, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ప్రతి పేదవాడికి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ పార్టీ మండల అధ్యక్షుడు ఎంపీటీసీ మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం దారేలా పంచాయతీ కేంద్రంలో కిలగాడ వైద్య

అధికారి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా వైసిపి పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ మల్లికార్జునరావు, సర్పంచ్ పాండురంగ స్వామిలు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి వైద్యం అందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని వైద్య సేవలు పొందాలని వారు అన్నారు. 650 మంది గిరిజన ప్రజలకు ప్రత్యేక వైద్య బృంద వైద్య అధికారులు శ్యామ్ సయ్యద్, శివ, నవిన్ మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అంగన్వాడి ఆశ తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని జెసిఎస్ మండల



ఇన్చార్జి బొడ్డు సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామసచివాలయంలో శుక్రవారం సర్పంచ్ వెట్టి లక్ష్మీ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ, 108 లను ప్రవేశ పెట్టి ఎన్నో వందల వేల ప్రాణాలు కాపాడారని అన్నారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఎన్.శ్రీధర్, ఎస్ టి.ఎస్మా సిమా నిటరింగ్ డివిజన్ కమిషన్ సభ్యులు చిక్కాల బాలు, కార్యదర్శి రామారావు, అంగన్వాడీ, సిబ్బంది హెల్త్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు

విశాలాంధ్ర - వి.మాడుగుల: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాదింపు చర్యలకు పూనుకుంటుందని, బదిలీ అయిన ఉపాధ్యాయులకు మూడు నెలలు నుండి జీతాలు చెల్లించలేదని దీనికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. జీతాల కోసం ప్రతినెల ఎదురు చూడటం అనే సమస్యను పరిష్కరించాలని, సెప్టెంబర్ నెల జీతాలు ఇప్పటికీ 60శాతం ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్స్‌కి చెల్లించబడలేదని, వెంటనే చెల్లించడానికి చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లా క్రికెట్ టీంకు ఎంపికైన చోడవరం విద్యార్థులు

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా క్రీడా సాధికార సంస్థ నిర్వహించిన బాలురు, బాలికల క్రికెట్ టీం అండర్ 17 సెలెక్షన్స్‌లో చోడవరం త్రినేత్ర క్రికెట్ అకాడమీ నుండి విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ త్రినేత్ర శుక్రవారం మీడియాకు తెలిపారు. ఎంపికైన వారిలో బాలికల టీంకు డి.నందిని (బ్యాటింగ్), కె.ప్రమోద్ (బ్యాటింగ్), కె.లోహిత్ అక్షియ్ (బౌలింగ్) క్రీడాకారులున్నారు. ఎంపికైన క్రీడా కారులకు స్పోర్ట్స్ డైరెక్టర్ జొన్నాడ శ్రీను, క్రికెట్ అకాడమీ సభ్యులు, సహ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

భాష వాలంటీర్లకు గౌరవ వేతనం విడుదల చేయాలి

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతంలో మాతృభాష కొండదొర, కొట్టియా, పివిటీజి గిరిజన జాతుల విద్యార్థిని విద్యార్థులకు మాతృభాషలో విద్యాభ్యాసం చేయాలని సంకల్పంతో సర్వ శిక్ష అభియాన్ ద్వారా గిరిజన ప్రాంతంలో భాష వాలంటీర్లవ్యవస్థ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ అల్లూరి సీతారామ రాజు

జిల్లా ఇంఛార్జి మొస్య సుజాత అన్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో సుమారు 700 మంది గిరిజన యువతి యువకులు ఆయా పాఠశాలల్లో మాతృ భాష వాలంటీర్లుగా పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. వారికి ప్రభుత్వము కేవలం 5వేల రూపాయలు గౌరవ వేతనం ఇవ్వడం శ్రమ దోపిడీ తప్ప మరొకటి కాదని విమర్శించారు. గిరిజనుల వాడుక భాషలో విద్య నేర్పిస్తున్న భాష వాలంటీర్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అలాగే పనికి తగ్గ వేతనం నెలకు 21 వేల రూపాయలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె కోరారు.

జనసేన క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - రాంబిల్లి: జనసేన పార్టీని ప్రతి ఒక్క క్రియాశీలక సభ్యుడు ముందుకు తీసుకువెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇంచార్జ్ సుందరపు విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో హరిపురంలో గల నియోజకవర్గ జనసేన ప్రధాన పార్టీ కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం వలన ప్రమాదవ శాత్తు యాక్సిడెంట్లో క్రియాశీలక సభ్యులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా సౌకర్యము 50 వేల మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం కార్యాలయం నుంచి వచ్చిన పార్టీ గుర్తు గాజు గ్లాసులు, పార్టీ నోట్ బుక్స్ ను, పార్టీ బ్యాగ్‌లను పంపిణీ చేసినట్లు రాంబిల్లి మండలాధ్యక్షులు పప్పల నూకన్నదొర తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ సీనియర్ నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

నౌపాడ, చీపురుపల్లి స్టేషన్‌లను డీఆర్ఎం తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, డివిజన్‌లోని సీనియర్ అధికారులతో కలిసి నౌపడ, చీపురుపల్లి స్టేషన్లలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఈ స్టేషన్లలో సౌకర్యాలు, సౌకర్యాలకు సంబంధించిన పలు అంశాలను సమీక్షించారు. చీపురుపల్లి స్టేషన్‌లో డి ఆర్ ఎం సౌరభ్ ప్రసాద్ 3వ-4వ లైన్ సామర్థ్యం పెంపు పనులు ప్రయాణీకుల సౌకర్యాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ సర్క్యులేటింగ్ ఏరియాను పూర్తి చేయడంపై దృష్టి సారించారు. ఆయన వెంట ఏ డి ఆర్ ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కోఆర్డినేషన్) ఏ కే మోహరానా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ సునీల్ కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏ కే త్రిపాఠి ఉన్నారు.

వెల్లంకిలో రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని వెల్లంకి గ్రామపంచాయతీలో ఉండే ప్రజలకు ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ లక్ష్మణరావు అన్నారు. ఆర్టీసీ బస్ స్టాప్ లేక తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలు బస్సులో ప్రయాణం చేయాలంటే సుమారు కిలోమీటరు మేర నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రయాణికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి కృషి

క్రికెటర్ భరత్ సన్మాన సభలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. భారత క్రికెట్ జట్టులో వికెట్ కీపర్ గా అత్యంత ప్రతిభాపాటవాలు చూపిన కోన శ్రీకర్ భరత్ సన్మాన సభ శుక్రవారం విశాఖ నగరంలోని ఒక హెూటల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ భరత్ క్రీడా స్ఫూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే యువ క్రీడాకారుడిని భారత జట్టుకు అందించిన భరత్ తల్లిదండ్రులను ఆయన అభినందించారు. రాష్ట్రంలో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు త్వరలోనే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ దేశంలోని 142 కోట్ల జనాభాలో క్రికెట్ క్రీడలో 14 మంది భారత్ జట్టులో భరత్ ఒకడిగా నిలిచాడని అన్నారు. దేశంలోని 10 కోట్ల మందిలో ఒక్కరికి ఇటువంటి అవకాశాలు లభిస్తుందని, అందులో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన భరత్కు ఈ సదవకాశం లభించటం మనందరికీ గర్వకారణం అని అన్నారు. రాష్ట్రంలోని క్రీడాకారులందరూ భరత్ ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. భరత్ క్రీడా స్ఫూర్తిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభినందిస్తూ ఆయనకు గ్రూప్ వన్ ఆఫీసర్గా ఉద్యోగం ఇవ్వటంతో పాటు, విశాఖలో 1000 గజాల స్థలం మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారని మంత్రి అమర్నాథ్ తెలియజేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారునికి చిత్తశుద్ధి, మంచి నడవడిక ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రికెట్ క్రీడలు ప్రోత్సహించేందుకు తమ అసోసియేషన్ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ కుల మతాలకు తావులేనిది క్రీడారంగమేనని, అపజయాన్ని, జయాన్ని సమానంగా తీసుకునేది క్రీడాకారులేనని అన్నారు.

సాంకేతికత సహకారంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

విశాఖపట్టణం సదస్సులో మాతృభూమి పైలట్ జియో పోర్టల్ ఆవిష్కరణ.

కమిషనర్ సిద్ధార్థ జైన్.

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : సాంకేతికత సహకారంతో భూ సంబంధిత అంశాలకు చెందిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, బహుళ ప్రయోజనాలు ఒనగూరుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ పేర్కొన్నారు. ఆ దిశగా అన్ని రాష్ట్రాలూ భూ రికార్డులను నవీకరణ చేయాలని సూచించారు. ఇప్పటికే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్సు మోడరనైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్టణ%శీ% ఒక హెూటల్లో శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు జరిగింది. భూ సర్వే, రికార్డుల భద్రత, నవీకరణ, మ్యుటేషన్ ప్రక్రియ, భూ సేకరణ, భూ సమీకరణ, రెవెన్యూ చట్టాల అమలు, రెవెన్యూ కోర్టు, ఈ-కోర్టు విధానాలు, స్వామిత్వ పథకం అమలు, ఆర్.ఓ.ఆర్. పట్టాల పంపిణీ తదితర అంశాలు సదస్సులో చర్చకు వచ్చాయి. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న భూ విధానాలు, రికార్డుల నవీకరణ ఇతర ప్రక్రియల గురించి ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ఉన్నతాధికారులు కేంద్ర బృందానికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. సదస్సులో భాగంగా వివిధ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే, ల్యాండ్ రికార్డ్సు విభాగం కమిషనర్ సిద్ధార్థ జైన్ ప్రారంభోపాన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్లో అమలు చేస్తున్న విధానాల గురించి వివరించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన సమస్యలు గానీ, ఇతర అడ్డంకులు గానీ ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, రోవర్లు, డ్రోన్లు ఉపయోగించి రీసర్వే ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రక్రియను 54 శాతం పూర్తి చేశామని పేర్కొన్నారు. పూర్తి పారదర్శకత ఉండేలా ఎఫ్.ఎం.బి. మ్యాపులను అనుసంధానించాలని, భూ ఆధార్ విధానంలో భాగంగా సంబంధిత రైతుల ఆధార్ నెంబర్లను ఖాతాలకు మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఒకే సాఫ్ట్వేర్ విధానంలో భాగంగా యావత్తు దేశానికి సంబంధించిన భూ సంబంధిత వివరాలను మాతృభూమి పోర్టల్ వేదికగా అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ క్రమంలో మాతృభూమి పోర్టల్ ఆవశ్యకతను, భవిష్యత్తులో ఒనగూరే ప్రయోజనాలను అజయ్ టిర్కీ వివరించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్తో పాటు అర్హత కలిగిన మరికొన్ని రాష్ట్రాలకు, జిల్లాలకు భూమి సమ్మాన్ ప్లాటినం సర్టిఫికేట్లను అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సోన్మోని బోరా మాట్లాడుతూ డిజిటల్ ఇండియా ఇనిసియేటివ్ ప్రాజెక్టులలో భాగంగా భూ సంవాద్ -6 ప్రాజెక్టు విజయవంతం అయ్యేలా అందరూ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ఎన్.ఐ.సి., ఐటీ టీం అధికారులు, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్ మోడల్ స్కూల్లో దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల వేషధారణలో అందరిని అలరించారు. కోలాటం, బోనాలు, బతుకమ్మ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెహరను కలిసిన బిల్డింగ్ ఇన్స్పెక్టర్

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ ఈరోజు నూతనంగా నియమితులైన జీవీఎంసీ బిల్డింగ్ ఇన్స్పెక్టర్ తేజ జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు తేజను అభినందించారు.

శరన్నవరాత్రి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - చింతపల్లి : విజయదశమిని పురస్కరించుకొని దేవి శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు నిర్ణయించారు. మండల కేంద్రంలోని రంగా సెంటర్ వద్ద గడచిన 29 ఏళ్లుగా దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 30వ ఏడాది కావడంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం అందుకు సంబంధించిన గోడ పత్రికను భక్తుల సమక్షంలో గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఆదివారం రంగా సెంటర్లో అమ్మవారి విగ్రహం ప్రతిష్టించి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు పెద్దలు నిర్ణయించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీలు దాసరి ధారలక్ష్మి, చిందాడ జయలక్ష్మి, వర్తక సంఘం అధ్యక్షుడు బొడ్డేటి జోగేశ్వరరావు, సాయం సత్యనారాయణ ,దూనబోయిన రమణ, మాదల తిరుపతి రాజు, తాటిపాకల రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలలో ఐసిడిఎస్ సేవలు అభినందనీయం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమంలో గర్భిణులకు సీమంతాలు

ట్రై కార్ చైర్మన్ బుల్లిబాబు, ఎంపీపీ అనూష దేవి

విశాలాంధ్ర - చింతపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలలో ఐసిడిఎస్ ఏర్పాటు చేస్తున్న సేవలు అభినందనీయమని ట్రై కార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఎంపీపీ కోరాబు అనూష దేవి, అన్నారు. కిటుముల పంచాయతీ పరిధిలోని జాజులపాలెం గ్రామంలో కిటుముల పంచాయతీ సర్పంచ్ జీ రమణమ్మ, ఎంపీడీవో ఆశాజ్యోతి ల ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను తిలకించారు. ఆ శాఖ ద్వారా గర్భిణీలకు ఘనంగా సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి పౌష్టికాహారం తీసుకుని పుట్టబోయే శిశువుకు మంచి ఆరోగ్యాన్ని అందించేందుకు ఐసిడిఎస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పుట్టిన శిశువుకు ముర్రుపాలు త్రాగించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి అందుతుందన్నారు. శిశువులకు క్రమం తప్పకుండా తల్లి పాలు ఇవ్వాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యాధికారుల సూచనల మేరకు గర్భిణీలు, బాలింతలు మందులు వాడాలన్నారు. నిపుణులైన వైద్యాధికారుల ద్వారా వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ ఎంపీటీసీ సభ్యురాలు వి పద్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు షేక్ గౌహరు స్నీషా, సిహెచ్ సత్యవతి, విజయ కుమారి, ఎస్ గౌరీ, పి అప్పల నరసమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బాదములతో సంపూర్ణ పోషక శక్తి

విశాలాంధ్ర -విశాఖ సిటీ : బాదంపప్పులు రుచికరమైన పోషకాహార శక్తిగా నిలుస్తాయని పలువురు ఆహార రంగ నిపుణులు సోహ ఆలీ ఖాన్, రితిక సమద్దార్, షీలా కృష్ణ వ్యాఖ్యానించారు. బాదంపప్పులు చిన్నవిగా కనిపించవచ్చు, కానీ అవి పోషక విలువల పరంగా మాత్రం చాలా ఉన్నతమైనవన్నారు. విటమిన్ ఈ, డైటరీ ఫైబర్, ప్రొటీన్, రిబోఫ్లావిన్, మాంగనీస్ మరియు ఫోలేట్తో సహా 15 రకాల పోషకాలు ఉంటాయన్నారు. అనేక శాస్త్రీయ అధ్యయనాలు బాదం వినియోగం యొక్క బహుముఖ ప్రయోజనాలను వెల్లడించాయని, గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం మరియు డయాబెటిస్ నిర్వహణకు సహాయం చేయడం నుండి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం బరువు నిర్వహణలో సహాయం చేయడం వరకు బాదం పప్పులు తమ సామర్థ్యాన్ని పదే పదే నిరూపించాయని చెప్పారు.

బిజమరవలసలో బాబుతో నేను

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండలంలోని పోతంగి పంచాయితీ పరిధిలోగల బీజమరవలస లోని ఆ పంచాయతీ పాలకవర్గ వార్డు సభ్యుడు కిల్లో లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం బాబుతో నేను అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ దేశం పార్టీ కోశాధికారి వంతల నాగేశ్వరరావు పాల్గొని వైసిపి ప్రభుత్వం అలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గిరిజనుల దృష్టికి తీసుకెళ్లారు. అవినీతి అక్రమ పాలన సాగిస్తున్న వైకాపా ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా చంద్రబాబు అక్రమ అరెస్టు విషయాన్ని గ్రామ గిరిజనులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు కే.రాంబాబు, గొల్లోరి గాసన్న, కిల్లో ధర్మ, కిల్లో డొంబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనముగా ఇబిసి చర్చ్ 10వ వార్షికోత్సవం



విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం ఏబి కాలనీ గ్రామములో పాస్టర్ బి.శామ్యూల్ ఆధ్వర్యంలో ఇబిసి చర్చ్ 10వ వార్షికోత్సవము ఘనముగా నిర్వహించారు,ముఖ్య అతిధులుగా బిషప్ ఎం చంటిబాబు,ఇబిసి మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ కె జె నాథనెల్ బ్రదర్, ప్రేమ భూషణం, పాస్టర్ ఏ గిరిబాబు, కె ప్రకాష్,డి ఇమ్మానుయేలు, బి.జేమ్స్ పాల్గొనిరి, బిషప్ ఎం.చంటిబాబు మాటాడుతూ రెవ బి శామ్యూల్ ఏజెన్సీ ప్రాంతములో దేవుని సేవ చేస్తూ, అనేకమందికి కళ్ళు కనిపించని పేదవారికి రాజమండ్రి బుద్ధుడు హాస్పిటల్ లో ఉచిత కంటి ఆపరేషన్ చేయించడం,చదువు కొనుటకు ఆర్ధికముగా వెనుకబడిన వారికి ఇబిసి మినిస్ట్రీ ధ్వరా సహాయం చెయ్యటం లాంటి మంచి సేవ కార్యక్రమములు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా అనేక మంది, ఇబిసి సంఘ పెద్దలు,గ్రామస్థులు వారి సేవలు కొనియాడిరి.

ఎల్ఐసీ క్లియ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నం ఎల్ఐసి క్లియ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షునిగా దేవాడ సత్య నారాయణ, సెక్రెటరీగా మాకిరెడ్డి వెంకి నాయుడు, ట్రెజరర్ గా కే నారాయణమూర్తి లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ నూతన కార్యవర్గానికి డివిజన్ నాయకులు అభినందనలు తెలియజేశారు. కొత్తగా నియమించబడిన వారు మాట్లాడుతూ క్లియ ఛానల్ బలోపేతం అవ్వడానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది.

అందుబాటులోకి ఫ్లిప్కార్ట్ వావ్ డీల్స్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : భారతదేశ స్వదేశీ ఇ-కామర్స్ గమ్యస్థానమైన, ఫ్లిప్కార్ట్ తమ వినియోగదారులకు అసాధారణమైన విలువను అందించడంలో ప్రీమియం ,సరసమైన స్మార్ట్ఫోన్ల యొక్క విస్తృత ఎంపిక కోసం గో-టు డెస్టినేషన్గానూ మారింది. ఫ్లిప్కార్ట్ తమ కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న స్మార్ట్ఫోన్ అవసరాలను తీర్చడానికి , అనేక రకాల పరికరాలను అందించడం కోసం వివిధ రకాలైన చెల్లింపు ఎంపికలు, విక్రేతలు అందించే అద్భుతమైన డీల్లు మరియు మొత్తంగా మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడం ద్వారా అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఫ్లిప్కార్ట్ యొక్క 'బిగ్ బిలియన్ డేస్' మిలియన్ల మంది భారతీయ కస్టమర్లు, ఎంఎస్ఎంఈ లు, కళాకారులు, బ్రాండ్లు మరియు పెద్ద పర్యావరణ వ్యవస్థకు విలువ మరియు సౌకర్యాన్ని అందించడం ద్వారా పండుగ స్ఫూర్తిని పొందుతుంది.

స్పందన ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ

విశాలాంధ్ర - మాకవరపాలెం : నర్సీపట్నం ఆర్డిఓ జయ రామ్ స్పందనలో వచ్చిన ఫిర్యాదు పై విచారణ చేపట్టారు . మాకవరపాలెం రెవిన్యూ లో రుత్తల పెంటమ్మ కు చెందిన 53 సెంట్ల జరాయితీ భూమి జూనియర్ కళాశాల స్థలంలో కొంత కలిసిందని కలెక్టర్ పఠాన్ శెట్టికి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆర్డిఓ జయరాం తాహసిల్దార్ ప్రసాద్ రావుతో కలిసి భూమిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు దీనిపై వచ్చిన నివేదికను కలెక్టర్ కి అందిస్తామన్నారు.

ఆయుస్మాన్ భారత్ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి ఎంపీడీఓ కార్యాలయంలో ఆయుస్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ సర్వే చేయుటకోసం మండలంలో అందరు ఏఎన్ఎమ్లకు, గ్రామ వాలంటీర్లకు అందరు పంచాయతీ కార్యదర్శులకు కార్యక్రమంలో కోసం అవగాహన కల్పించి ట్రైనింగ్ ఇవ్వడం జరిగినదని ఎంపిడిఓ యాదగిరేశ్వారావు తెలిపారు.

చంద్రబాబు అక్రమ అరెస్ట్ పై మోదీ, అమిత్ షా జోక్యం చేసుకోవాలి

మాజీ మంత్రి బండారు సత్యన్నారాయణ

విశాలాంధ్ర - పెందుర్తి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసి పైశాచికానందం పొందుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బుద్ధిచెప్పాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహెూంమంత్రి అమిత్ షాలకు మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత బండారు సత్యన్నారాయణమూర్తి విజ్ఞప్తి చేసారు. సబ్బవరంలోటిడిపి శ్రేణులు నిర్వహించిన బాబుతో నేను కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్న కార్యక్రమంలో బండారు మాట్లాడుతూ ఎలాంటి తప్పు చేయని సీనియర్ నేత చంద్రబాబును గత 33 రోజులుగా జైల్లోపెట్టి వేధిస్తున్నప్పటికీ కేంద్రం పెద్దలు స్పందించక పోవడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. కేంద్రం మద్దతు లేకుండా జగన్ ఇలాంటి దారుణానికి ఒడిగట్టే సాహసం చేయరంటూ ప్రజందరూ భావిస్తున్నారని బండారు తెలిపారు. ఇకనైనా నయానో, భయానో జగన్ మెడలు వంచాలని ఆయన కోరారు. న్యాయస్థానాలపట్ల తమకు అపారగౌరవం ఉందని, నిజా, నిజాలు త్వరలోనే బయిటకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బరనికాన సాయినాథ రావు, 96 వ వార్డు అధ్యక్షులు వేగి పరమేశ్వర రావు, సబ్బవరం మండల పార్టీ అధ్యక్షులు మిడతాన మహాలక్ష్మినాయుడు, మాజీ అధ్యక్షులు గండి ముత్యాలనాయుడు, గండి రవి, దొడ్డి సూర్యప్రకాశరావు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, జనసేన నాయకులు కర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రికి పెద గంట్యాడ తెలుగుదేశం పార్టీ నాయకులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్టుకు వ్యతిరేకముగా వివిధ మార్గాలలో నిరసనలు తెలియ చేస్తూ ఆయన ఆరోగ్యముగా ఉండాలని, ఆయనకు దగ్గరగా ఉండాలని రాజమండ్రిలో బస చేసి ఉన్న శ్రీమతి నారా భువనేశ్వరి గారిని, శ్రీ నారా లోకేశ్ బాబు గారిని, నందమూరి కుటుంబ సభ్యులను , అక్కడ వారికి మద్దతుగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను కలసి మేము కూడా మీతో ఉన్నాము అని తెలియ చేసే ఉద్దేశంతో వారి పోరాటానికి సంఘీభావం తెలియ చేయడానికి పెద గంట్యాడ తెలుగుదేశం పార్టీ నాయకులు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటి రాజు, జిల్లా నాయకులు, పెద్దాడ సోము నాయుడు , శ్రీముసిరి శ్రీనివాస రావు 75వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్, ఇతర నాయకులు, అండి బోయిన రాము నాయుడు, ములకలపల్లి పెంటయ్య, ఎళ్ళంకి రమణ, కండిపిల్లి రమణ, దొమ్మేటి నాగరాజు, కాకినాడ అప్పల రాజు తదితరులు ఉక్కునగరంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బయలు దేరి వెళ్లారు.

ప్రత్యామ్నాయ గిరిజనాభివృద్ధి అజెండాతో అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలి

సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి : రాబోవు సార్వత్రిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యామ్నాయ గిరిజనాభివృద్ధి అజెండాతోనే ముందుకు రావాలని సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఆ పార్టీ పాడేరు నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు, జీకే మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలలో పరిపాలిస్తున్న ప్రభుత్వాలు గిరిజనులకు ప్రత్యేకించి ఏ రకమైన అభివృద్ధి, సంక్షేమం తీసుకురాలేదని మండిపడ్డారు. ఉన్న చట్టాలు, హక్కులు అమలు చేయవలసింది పోయి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 3 రద్దుతో నిరుద్యోగ యువత ఉపాధికి గండి కొట్టారని విమర్శించారు. గిరిజనులకు రక్షణగా ఉన్న భూ బదలయింపు, 1/70 చట్టాలను ప్రభుత్వాల చుట్టంగా మారాయని దుయ్యబట్టారు . ఇటువంటి పరిస్థితుల్లో గిరిజనుల యొక్క అభివృద్ధి ఎలా సాధ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనుల సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఐదు మండలాల కార్యదర్శులు . పాంగి ధనుంజయ్ (చింతపల్లి) ఎల్ సుందర్రావు (పాడేరు) సాగిన ధర్మానపడాల్ (జిమాడుగుల). ఎస్ సూరిబాబు(కొయ్యూరు) తోపాటు గడుతూరు సత్యనారాయణ, సాగిన చిరంజీవి, వై అప్పలనాయుడు ఐదు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మాడుగుల నియోజవర్గం చీడికాడ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాసరావుని నియమిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. డిసిసి ప్రెసిడెంట్ గా బొడ్డు శ్రీనివాసరావుని నియమించినందుకు అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగ న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతు. అనకాపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం తీసుకువచ్చే విధంగ బొడ్డు శ్రీనువాస రావు కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు.ఆయన నాయకత్వంలో మంచి ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించే విధంగా శ్రీనివాసరావు కృషి చేయాలని అన్నారు.

వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ గా దేవవరపు వెంకటేశ్వరరావు నియామకం

విశాలాంధ్ర - పాయకరావుపేట : వ్యవసాయ సలహా మండలి పాయకరావుపేట మండల చైర్మన్ గా మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దేవవరపు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. దేవవరపు వెంకటేశ్వరరావు గతంలో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడుగా, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ గా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా, పాల్తేరు సర్పంచ్ గా రెండు పర్యాయాలు, ఎంపీటీసీగా, వైసీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తనకు పదవి కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కు, జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ చిక్కాల రామారావు కు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేశ్వరరావుకు పదవి పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.24,500 ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - మల్కాపురం : సూక్ష్మ,చిన్న మరియు మధ్య తరహా ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (ఎంఎస్ఎంఈడిసి) మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ శుక్రవారం 61 వార్డ్ కార్పొరేటర్ అధ్యక్షులు, మరియు సీనియర్ నాయకులు సమక్షంలో నక్కవానిపాలెం పార్టీ ఆఫీసు నందు 61 వార్డ్ , ప్రియదర్శిని కాలనీ కి చెందిన చదువుల తల్లి ఆశాజ్యోతి, ఆశా కిరణం వి.ప్రసన్నకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు కారణంగా చదువు ముందుకు సాగించలేని స్థితిలో ఉన్నందున ఆ యెక్క విషయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఆనంద్ కుమార్ దృష్టికి రావటం వలన ఆమెకు చదువు ముందుకు సాగించుటకు గాను తగు ప్రోత్సహం కల్పిస్తూ అందుకు అగు సొమ్మును రూ.24,500/-లు చెక్ ను వి.ప్రసన్న తల్లీ, దండ్రులు కు అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధా, స్థానిక నాయకులు భోగ వెల్లి నాగభూషణం, జీవీఎస్ఎన్ రాజు (వాసు), బూస అప్పలనాయుడు నూక రెడ్డి పాల్గొన్నారు

సాంసంగ్ గెలాక్సీ ఏ సిరీస్పై రాయితీలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఎంపిక చేయబడిన గెలాక్సీ ఏ సిరీస్ స్మార్ట్ ఫోన్స్ పై సాంసంగ్ ప్రకటించిన ఉత్తేజభరితమైన ఆఫర్స్ ఈ పండగ సీజన్ లో ఇంతకు ముందు లేని డీల్స్ ను తెచ్చాయి. రూ. 3500 వరకు తక్షణ క్యాష్ బ్యాక్, బ్యాంక్ క్యాష్ బాక్స్ రూ. 2000 వరకు మరియు 14 నెలల వరకు సులభ ఈ ఎం ఐ చెల్లింపు ఆప్షన్స్ వంటి ఆఫర్స్ తో వినియోగదారులు ఈ స్మార్ట్ ఫోన్స్ ను ఈ దీపావళికి సులభంగా కొనుగోలు చేయగలరు. భారతదేశపు నంబర్ 1 గా విక్రయించబడే 5జీ స్మార్ట్ ఫోన్ గెలాక్సీ ఏ 14 5 జీ, (4జీబీప్లస్ 64జీబీ రకం)రూ. 18499 (ఎంఆర్పీ)కి లభిస్తోంది., అది ఇప్పుడు కేవలం రూ. 14499కి మాత్రమే లభిస్తోంది. కొనుగోలు చేయడానికి ఇష్టపడే వినియోగదారులు శామ్ సంగ్ ఫైనాన్స్ పై నో కాస్ట్ ఈ ఎం ఐ కి 8 నెలలు వరకు ఎంపిక చేయవచ్చు ప్రతి రోజూ కేవలం 44కి సొంతం చేసుకోవచ్చు. రూ. 28990కి లభించే గెలాక్సీ ఏ23 5 జీ, (6జీబీప్లస్ 128జీబీ రకం) ఆకర్షణీయమైన పండగ ధర ఇప్పుడు రూ. 18999కి లభిస్తుంది. రూ. 354499కి లభించే గెలాక్సీ ఏ 34 5 జీ, (8జీబీప్లస్ 128జీబీ రకం) వంటి ప్రీమియం ఏ సీరీస్ మోడల్స్ ఇప్పుడు రూ. 25999కి లభిస్తున్నాయి.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

లంబసింగ్ సర్పంచ్ శాంతి కుమారి

విశాలాంధ్ర - చింతపల్లి : లంబసింగి పంచాయతీ కేంద్రంలోని సచివాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని పంచాయతీ పరిధిలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ పంచాయతీ సర్పంచ్ కొర్ర శాంతి కుమారి అన్నారు. లంబసింగి పంచాయతీ సచివాలయంలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు ఆధార్ లలో తలెత్తిన సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో వారి సౌకర్యార్థం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో ఆమెతో పాటు మాజీ సర్పంచ్ రఘునాథ్, వైసిపి నాయకులు నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్ను పరిశీలించిన డీఆర్ఎం

విశాలాంధ్ర - గోపాలపట్నం : దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభు త్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో సింహాచలం రైల్వే స్టేషన్ను కూడా ఎంపిక చేశారు. ఈ మేరకు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ గురువారం మధ్యాహ్నం పలువురు అధికారు లతో కలిసి సింహాచలం రైల్వే స్టేషన్ను సందర్శించారు. అమృత్ భారత్లో భాగంగా స్టేషన్లో చేపట్టనున్న 'పనులపై అధికారులకు సూచనలి చ్చారు. స్టేషన్లో ఫుట్ ఓవర్ వంతెన విస్తరణ, ప్రాంగణం అభివృద్ధి, ప్లాట్ఫారాల అధునీకరణతో పాటు స్టేషన్లో సంబంధిత విభాగాధిపతులతో చర్చించారు.